# ఓట్ల కోసమే కాంగ్రెస్ డ్రామా

- రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన దొంగ రేవంత్
- ఆరు గ్యారంటీలే సక్కగా అమలు చేయట్లేదు
- రైతులు ఆగమవుతుంటే పట్టించుకోవట్లేదు
- బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి ధ్వజం

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 23: అసెంబ్లీ ఎన్నికల ముందర ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేని సీఎం రేవంత్‌రెడ్డి.. లోక్‌సభ ఎలక్షన్లలో ఓట్ల కోసమే ఇప్పుడు రుణమాఫీ డ్రామా ఆడుతున్నాడని బీఆర్ఎస్ నిజామాబాద్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తాతో కలిసి నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఓటుకు నోటు కేసులో రెడ్‌హ్యాండెడ్‌గా రూ.50 లక్షలతో పట్టుబడిన దొంగ రేవంత్‌రెడ్డి చెప్పే మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. లక్ష్మి నరసింహస్వామి, సరస్వతి అమ్మవారి మీద ఒట్టేసి ఓట్లు అడుగుతున్న రేవంత్‌పై ఈసీ చర్యలు తీసుకోవాలని కోరారు.

గెలువగానే తొలి సంతకం రుణమాఫీపైనే అని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఎన్నికల కోసమే మళ్లీ రుణమాఫీ అంటున్నాడని విమర్శించారు. రైతులు ఆగమవుతుంటే పట్టించుకోవడం లేదన్నారు. జీవన్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్ర మంత్రిని చేస్తా అంటుండు. అసలు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందా? అని ప్రశ్నించారు. సీఎం తమ్ముళ్లే ఆయన బొమ్మ పెట్టుకోవడం లేదు. నీ కుటుంబం సక్కగా లేదు. నా కుమారుల గురించి నువ్వు మాట్లాడుతున్నావా? అని నిలదీశారు. రేవంత్ అంత లత్కోర్ ఎవరూ లేరన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటల కరెంట్ ఇచ్చి రైతులను ఆదుకున్నాడని, కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియడం లేదన్నారు. బీజేపీని ఎదురిస్తే జైలులో పెడుతున్నారని, రేవంత్, మోదీ ఒక్కటై కవితను జైలులో పెట్టారని ఆరోపించారు. బ్లాక్‌మనీ తెచ్చి ప్రజలకు పంచుతామని మోదీ, పసుపుబోర్డు తెస్తానని అర్వింద్ ప్రజలను మోసం చేశారన్నారు. కేసీఆర్‌ను ఎందుకు కాదనుకున్నామని, కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేశామని ప్రజలు బాధ పడుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడతారని చెప్పారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

### అన్నీ అబద్ధాలే

ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి మరో మారు డ్రామాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఎటు పోయాయని ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో రేవంత్, రాహుల్‌గాంధీ టాక్స్ నడుస్తున్నదన్నారు. ఇప్పటికీ రైతుబంధు ఇవ్వలేదు. ఇక రుణమాఫీ ఎలా చేస్తారని ప్రశ్నించారు. కోరుట్లలో డాక్టర్ సంజయ్ చేతిలో ఓడిపోయిన అర్వింద్, జగిత్యాలలో సంజయ్ చేతిలో ఓడిన జీవన్ రెడ్డి.. నిజామాబాద్‌లో బాజిరెడ్డి మీద ఎలా గెలుస్తారన్నారు. బాజిరెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల వీడియో క్లిప్పింగ్‌లను చూపిస్తున్న జీవన్‌రెడ్డి



### కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు..

దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రజలను మరోసారి మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని తేదీతో సహా ప్రకటించి మోసం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అబద్ధాలు నమ్మి ప్రజలు విలవిల్లాడుతున్నారని, మార్పు కోరుకున్న వారికి ఊహించని రీతిలో కాంగ్రెస్ ఇబ్బందుల్లోకి నెట్టిందన్నారు. కేసీఆర్‌ను కాదనుకున్న పాపానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఇప్పుడిప్పుడే మేల్కొంటున్నారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించడం ఖాయమన్నారు. జీవన్‌రెడ్డిని కేంద్ర మంత్రి చేస్తానన్న రేవంత్ రెడ్డి.. ఎమ్మెల్యే టికెట్ ఎవరికి ఇవ్వాలో అడిగేందుకు ఢిల్లీకి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నదని. ఇక కేంద్ర మంత్రి పదవి ఇచ్చే దమ్ముందా? అని ప్రశ్నించారు. మేయర్ దండు నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నగర అధ్యక్ష, కార్యదర్శులు సిర్ప రాజు, ఎనుగందుల మురళి, సీనియర్ నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్ పాల్గొన్నారు.





## జై బజరంగ్ భళీ..

ఉమ్మడి జిల్లాలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

# రేవంత్ చెప్పినవన్నీ అబద్ధాలే..

- ఎర్రజొన్న రైతులను ఆదుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం
- అన్నదాతలపై కేసులను ఎత్తివేసింది కేసీఆరే
- పసుపుబోర్డు అంటూ మరోసారి మోసం చేస్తున్న అర్వింద్
- కేసీఆర్ పాలన రైతులకు స్వర్ణయుగం లాంటిది..
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్, ఏప్రిల్ 23 : ఇచ్చిన హామీలు అమలు చేయలేని సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ సర్కారును విమర్శించడం సరికాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేశారని మండిపడ్డారు. సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వేముల ఖండించారు. గతంలో ఎర్రజొన్న రైతుల బకాయిలు ఇప్పించాలని ఆందోళన చేస్తే కాల్పులు జరిపించింది, అక్రమంగా కేసులు పెట్టించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభు త్వం బకాయిలు ఎగ్గొడితే కేసీఆర్ ప్రభుత్వం రూ.11 కోట్ల బకాయిలు రైతులకు చెల్లించడమే కాకుండా బేషరతుగా కేసులు ఎత్తివేసిందని గుర్తు చేశారు. రైతులపై నిజమైన ప్రేమ ఉన్న నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు సిసలైనది తెస్తానని మళ్లీ మాయ మాటలు చెప్పి రైతులను దగా చేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. 50 ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు పసుపు బోర్డు ఇవ్వడానికి మనసు రాని కాంగ్రెస్ .. ఎన్నికల కోసం కల్లబొల్లి మాటలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

### రైతుల గుండెల్లో కేసీఆర్

బోధన్ షుగర్ ఫ్యాక్టరీని సెప్టెంబర్ 17లోపు తెరిపిస్తానని మరోసారి మోసం చేయడానికి రేవంత్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారన్నారు. ఫ్యాక్టరీ మూసివేసిందే కాంగ్రెస్ ప్రభుత్వమని, బట్ట కాల్చి మీద పడేసే నీచ బుద్ధి రేవంత్‌రెడ్డిదన్నారు. కేసీఆర్ పాలన రైతాంగానికి స్వర్ణయుగం లాంటిదని పేర్కొన్నారు. ఈ రోజు ఇంత గొప్పగా రైతులు వ్యవసాయం చేస్తున్నారంటే అది కేసీఆర్ చలువ కాదా ? అని ప్రశ్నించారు. రుణమాఫీ కోసం పుట్టెడు అబద్ధాలు ఆడుతున్న రేవంత్‌రెడ్డికి పుట్టగతులు ఉండవన్నారు. ఓట్ల కోసం దేవుళ్లపై ప్రమాణం చేస్తూ రైతులను రేవంత్‌రెడ్డి మభ్యపెడుతున్నాడని, రైతులతో ఆటలాడుకున్న ఎవరు బాగు పడలేరన్నారు. ఇదే రైతులు రేవంత్‌రెడ్డికి రాజకీయ సమాధి కట్టే రోజులు త్వరలో వస్తాయన్నారు.

### అబద్ధాల్లో అర్వింద్‌కు ఆస్కార్ అవార్డు

పదేండ్లు అధికారంలో ఉండి పసుపు బోర్డు సాధ్యం కాదని చెప్పిన బీజేపీ కూడా ఎన్నికల లబ్ధి కోసం పసుపు బోర్డు ఇచ్చామని ప్రధానమంత్రితో అబద్ధపు ప్రకటన చేయించిందన్నారు. అడ్రస్ లేని పసుపు బోర్డును ఆకాశంలో చూపెట్టి ఓట్లడిగే దుష్ట సంప్రదాయానికి బీజేపీ ఒడిగట్టిందని మండిపడ్డారు. బాండ్ పేపర్ గుండు అర్వింద్ అబద్ధాలు చెప్పడంలో ఆస్కార్ అవార్డు పొందాడని ఎద్దేవా చేశారు. అన్నం పెట్టే అన్నదాతలను అబద్ధాలతో మోసం చేస్తున్నాడని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలకు రైతుల ఉసురు తగులుతుందని తెలిపారు. పసుపు బోర్డు కోసం నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిసి వారి నుంచి లేఖలు తెప్పించి, కేంద్ర ప్రభుత్వానికి అందజేసి విశ్వప్రయత్నాలు చేసింది అప్పటి ఎంపీ కవిత కాదా? అని ప్రశ్నించారు. పసుపు బోర్డు ఇవ్వాల్సింది కేంద్రం, కానీ పార్లమెంట్‌లో పసుపు బోర్డుపై గళం ఎత్తి పోరాటం చేసిన కవితపై ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతుకు నష్టం

- మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి
- ఆర్మూర్‌లో తడిసిన ధాన్యం పరిశీలన



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 23: అకాల వర్షాలకు పంటలు దెబ్బ తిన్న రైతులను ఆదుకోవాలని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రైతులు పూర్తిగా నష్టపోతున్నారని ఆరోపించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కంటికి రెప్పలా చూసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాలుగునెలల్లోనే రైతులకు కష్టాలు వచ్చాయన్నారు. హస్తం పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలు అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. జీవన్‌రెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

## నేడు మాచారెడ్డికి హరీశ్‌రావు



మాచారెడ్డి, ఏప్రిల్ 23:మాజీ మంత్రి హరీశ్‌రావు నేడు మాచారెడ్డికి రానున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని గజ్యానాయక్‌తండా,ఎక్స్‌రోడ్‌లో బుధవారం సాయంత్రం రోడ్ షో నిర్వహించనున్నారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ హాజరయ్యే ఈ కార్యక్రమానికి భారీగా తరలి రావాలని పార్టీ మండల అధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం కోరారు.

## నేటి నుంచి వేసవి సెలవులు

కామారెడ్డి, ఏప్రిల్ 23: ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు నేటి నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు ఉంటాయని, 12వ తేదీన బడులు పునఃప్రారంభమవుతాయని కామారెడ్డి డీఈవో రాజు తెలిపారు. సెలవుల కాలంలో జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు మూసివేయాలని, ఎవరైనా క్లాసులు నడిపిస్తే సంబంధిత యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకునే ముందు తల్లిదండ్రులు సంబంధిత మండల విద్యాశాఖాధికారిని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకున్నాకే అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు.


## మరో 16 నామినేషన్లు

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 23: నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి నామినేషన్లు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం మరో 16 నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. బహుజన్ లెఫ్ట్ పార్టీ అభ్యర్థి అశోక్ గౌడ్ అబ్బగోని, ఆలిండియా బీసీ ఓబీసీ పార్టీ అభ్యర్థి పోతు నవీన్, ప్రజాసేన పార్టీ అభ్యర్థి పోతు నాగరాజు, ఆలిండియా నేషనల్ పార్టీ అభ్యర్థి ఎండీ షాహెద్‌ఖాన్, దళిత బహుజన పార్టీ అభ్యర్థి గోలి నరేశ్ నామినేషన్లు సమర్పించారని వివరించారు. స్వతంత్ర అభ్యర్థులుగా కొత్తకొండ శక్తిప్రసాద్, బీబీనాయక్, మహ్మద్ జమీల్, జి.సాయికృష్ణ మూర్తి నామినేషన్లు వేశారన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు రాపెల్లి సత్యనారాయణ, రాపెల్లి శ్రీనివాస్‌తో పా టు ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి కండెల సుమన్ కూడా మరో సెట్ పత్రాలు దాఖలు చేశారన్నారు. వీరితో పాటు అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ పార్టీ అభ్యర్థి యుగంధర్ గట్ల, యుగ తులసి పార్టీ అభ్యర్థి కోటగిరి శ్రీనివాస్, విద్యార్థులు రాజకీయ పార్టీ అభ్యర్థి భూక్య నందు, స్వతంత్ర అభ్యర్థిగా కాట్రాజి ప్రశాంత్ మరో సెట్ నామినేషన్లు వేశారని వివరించారు. ఇప్పటిదాకా 26 మంది అభ్యర్థులు మొత్తం 44 నామినేషన్లు దాఖలు చేశారని రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు.

**బీఆర్ఎస్ అధినేత,** మాజీ సీఎం కేసీఆర్‌తో మంగళవారం ఓ మీడియా ఛానల్ నిర్వహించిన బిగ్ డిబేట్‌ను జనం ఆసక్తిగా తిలకించారు. రాత్రి 7 నుంచి 11 గంటల వరకు ప్రజలంతా టీవీలకు అతుక్కుపోయారు. ఉమ్మడి జిల్లా ప్రజలు, బీఆర్ఎస్ అభిమానులు కేసీఆర్ ఇంటర్వ్యూను కుటుంబాలతో సహా తిలకించారు.



నిజామాబాద్‌లోని ఓ హోటల్‌లో కేసీఆర్ ఇంటర్వ్యూను ఆసక్తిగా తిలకిస్తున్న అభిమానులు



బాన్సువాడలో.. ఓ కుటుంబం



కోటగిరిలో..



కామారెడ్డిలో కేసీఆర్ ఇంటర్వ్యూను ఆసక్తిగా తిలకిస్తున్న మహిళలు